క్లుప్తంగా

ఎంఈఓగా ఉమాశంకర్



ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎంఈఓగా ఉమాశంకర్‌ను నియమిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన టీవీఆర్ఎన్ స్వామి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో విద్యాశాఖ నిబంధనల ప్రకారం మండలంలో ఉన్నత పాఠశాలల నుంచి సీనియర్ హెచ్ఎంకు అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు సుభాష్‌నగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్‌కు ఎంఈఓగా విద్యాశాఖ బాధ్యతలు అప్పగించింది.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు

పాల్వంచరూరల్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. అధ్యాపకులు పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఈ పరీక్ష కేంద్రంలో 450 మంది విద్యార్థులు బీకాం, బీఎస్సీ, బీసీఏ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు.

శ్రీరామచంద్ర కాలేజీలో కొత్త కోర్సులు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనంగా బీఎస్సీ డైరీ సైన్స్, బీఎస్సీ డేటా సైన్స్, బీఎస్సీ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, బీకాం ఈ కామర్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కోర్సులలో చదువుతో పాటు ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రతీనెల జీతం కూడా ఇస్తుందని తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఎండ నుంచి ఉపశమనం పొందడానికి బుధవారం టీయూసీఐ నాయకులు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పెద్దబోయిన సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు వై.గోపాలరావు మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంతాల్లో ఎండలు తీవ్రంగా ఉన్నందున, ఎండదెబ్బ తగిలి కార్మికులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉన్నందున, వారికి మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారుల్లో చలనం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తక్షణమే మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను పరిరక్షించాలని, కార్మిక లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలని కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగమ్మ, కే.శంకర్, ఆదిలక్ష్మి, రాజేష్, హసీనా, ఉమేష్, మల్లేష్, రోజా, సరళ పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

- చిన్న హరిజనవాడలో అల్లాడుతున్న దళితులు
- పట్టించుకోని అధికారులు



వైకుంఠధామం వద్ద నీళ్లు పట్టుకుంటున్న చిన్నహరిజనవాడ వాసులు

జూలూరుపాడు: కొత్తూరు గ్రామ పంచాయతీ చిన్న హరిజనవాడలో తాగునీటి ఎద్దడితో దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం బోరు బావి విద్యుత్ మోటార్ చెడిపోయి రెండేళ్లు అయింది. మరమ్మతుల కోసమని విద్యుత్ మోటార్‌తోపాటు, పైపులు తీసి బయటవేశారు. విద్యుత్ మోటార్‌ను తీసుకెళ్లగా పైపులు అక్కడే వదిలేయడంతో తుప్పు పట్టిపోయాయి. మోటారుకు రిపేరు చేయించే దిక్కు లేదు. తాగునీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ సెక్రటరీ, అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతి పంపు మూలనపడటంతో ఇటీవల బోరుబావి ఫ్రెషింగ్ చేయించారు కానీ, ఆ నీళ్లు తాగేందుకు ఉపయోగపడవు. దీంతో గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నామని మహిళలు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదని ఒకటి, రెండు బిందెల నీళ్లే వస్తున్నాయని చెబుతున్నారు. రక్షిత మంచినీటి పథకం పని చేయకపోగా, మిషన్ భగీరథ నీళ్లు కార అష్టకష్టాలు పడుతున్నట్లు బాధితులు చెబుతున్నారు. అరకిలోమీటర్ దూరంలో ఉన్న వైకుంఠధామంలోని విద్యుత్ మోటార్ వద్ద నుంచి తెచ్చుకొని దాహార్తి తీర్చుకుంటున్నామన్నారు. త వేసవిలో తాగునీటి కోసం పడిరాని పాట్లు పడుతున్నామని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రక్షిత మంచినీటి పథకం మూలపడటం, చేతిపంపు నీళ్లు వాడుకునే పరిస్థితి లేకపోవడంతోపాటు, మిషన్ భగీరథ నీళ్లు వైకుంఠధామం వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్న హరిజనవాడలో 20 దళిత కుటుంబాలు, 80 మంది జనాభా. ఇప్పటికైనా అధికారులు స్పందించి హరిజనవాడలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు



మూలనపడిన రక్షిత మంచినీటి పథకం

ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డిని వివరణ కోరగా... చిన్న హరిజనవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమ్మెను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

ఇల్లెందు: ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మెను కార్మిక సంఘాలు కలిసి కట్టుగా విజయవంతం చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు నబీ కోరారు. బుధవారం ఇల్లెందులోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని, కార్మికులను అత్యధికంగా తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్, జాఫర్, కొప్పుల శ్రీనివాస్, తాళ్లూరి కృష్ణ, దేవరకొండ శంకర్, వెంకటనారాయణ, అబ్బాస్ పాల్గొన్నారు. అదేవిధంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వర్లు, డిపో కార్యదర్శి ఉపేంద్రచారీ, ఎస్ఏ నబీ కోరారు. మంగళవారం ఆర్టీసీ కార్మికులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ టీయూసీఐ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. బుధవారం ఇల్లెందులోని ఎల్లన్న భవన్‌లో జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి యాకుబ్ షావలీ మాట్లాడారు. ఈ సమావేశంలో పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, వీరన్న, గురునాథం రఘు, మల్లేష్ పాల్గొన్నారు.

నోటీసు అందజేత..

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 20న జాతీయ కార్మిక సంఘాలు సమ్మె తలపెట్టాయి. ఈ మేరకు ఇఫ్టూ నాయకులు బుధవారం సమ్మె నోటీసును లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఎండీ రాసుద్దీన్, సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, మోత్కూరి ధర్మారావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: మున్సిపాలిటీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్‌వీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ కె.సుజాతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బాపూజీ నగర్‌లో గత సంవత్సరం రెండు కల్వర్టులకు నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదన్నారు. హమాలీ కాలనీ నుంచి వనమా కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి నిదులు మంజూరైనా ప్రారంభించలేదన్నారు. పలు ఏరియాల్లో రోడ్లపైకి మురుగు నీరు చేరి ప్రజలు అనారోగ్యాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, పట్టా బాబూరావు, దీపక్ మెహతాబ్, అజ్జు, శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేల తల్లిని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణమ్మ

సుజాతనగర్: ఎరువులు పురుగు మందులను తగ్గించి నేల తల్లిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం నిమ్మలగూడెం గ్రామంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..

రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడటం వలన భూ ఆరోగ్యం నశిస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో పంటలు పండించటం చాలా కష్టం అవుతుందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శివ, ఏఓ నర్మద, ఉద్యానవన అధికారి ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 16వ తేదీన చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పానాధికారి కొండపల్లి శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో ఉన్న 100 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, 18 - 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు.

నిర్మాణ కార్మికులపై వివక్ష గర్హనీయం



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణ కార్మికుల పట్ల వివక్ష తగదని నిర్మాణ కార్మికుల జేఏసీ చైర్మన్ వి.హతిరాం అన్నారు. స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం 50వ రోజుకు చేరుకున్నాయి. మాట్లాడుతూ.. కేటీపీఎస్ యాజమాన్యం లిఖిత పూర్వక హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. త్వరలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బి.మురళీకృష్ణ, బి.లక్ష్మణ్‌నాయక్, చంటి, బాలు, రాంబాయి, ద్వాలి, శాల్కు, నీల, నిరోష, మంగ, సమ్మక్క, రజిని, వెంకటనారాయణ, బలరాం పాల్గొన్నారు.

కార్మిక హక్కులపై దాడిని ప్రతిఘటించండి..



మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల అమలు, పర్మనెంట్ ఉద్యోగ స్థానంలో ఫిక్స్‌టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, యూనియన్ల మనుగడ లేకుండా చేయాలని కార్మిక హక్కులపై దాడిని ప్రతిఘటించాలని, జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని ఏరియా వర్క్‌షాపులో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో జేఏసీ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

జార్జికి సీఐటీయూ నివాళి

సింగరేణి(కొత్తగూడెం): సీఐటీయూ వ్యవస్థాపకుల్లో ఒకరైన జార్జి 34వ వర్ధంతిని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా రామవరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్తూపం వద్ద గల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయగిరి శ్రీనివాస్, రమేష్‌కుమార్ మక్కడ్, గాజుల రాజారావు, వైవీరావు, ఎంఎస్ ప్రకాశ్, పసుపులేటి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఇల్లెందు: కాకతీయ నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు షేక్ మహబూబ్ (65) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మహబూబ్ మృతి పట్ల దిండిగల రాజేందర్, మడత వెంకట్‌గౌడ్ తదితరులు సంతాపం తెలిపారు.

నిధుల కేటాయింపులో వివక్షకు తావివ్వం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: ప్రణాళికలతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామని, నిధుల కేటాయింపులో ఎక్కడా వివక్షకు తావివ్వమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని మంచికంటినగర్, పాలకోయ తండా, నవభారత్, జగ్గుతడా, గోవర్ధనగిరి కాలనీ, కొమ్ముగూడెం, గొల్లగూడెం, సీతారాంపట్నం, ప్రియదర్శిని కాలనీల్లో రూ.2.65 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకర్గ అభివృద్ధిలో ప్రజా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎస్కే సాబీర్ పాషా, కొత్వాల శ్రీనివాసరావు, అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, ఇట్టి వెంకట్రావ్, చెరుకూరి శేఖర్, మన్నెం వెంకన్న, వల్లపు యాకయ్య పాల్గొన్నారు.

ఐఆర్ వింగ్ పర్సనల్ మేనేజర్ బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలోని ఐఆర్ వింగ్‌లో పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న లావుడ్యా తిరుపతిని మణుగురు ఏరియా పర్సనల్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆకస్మికంగా జరిగిన ఈ బదిలీకి కారణం తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. సింగరేణి సంస్థలో విధులు నిర్వహించే ఎగ్జిక్యూటివ్స్‌ను ప్రతీ మూడేళ్లకోసారి బదిలీ చేయాల్సి ఉండగా, గతంలో పనిచేసిన అధికారుల ఒంటెద్దు నిర్ణయాల వలన కొంతమందిని మాత్రమే బదిలీ చేస్తున్నారని, పలుకుబడి ఉన్నవాళ్లు మాత్రం ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇటీవల సింగరేణి భవన్ నుంచి వివిధ ఏరియాల్లో లాంగ్ స్టాండింగ్ అధికారుల జాబితా ఇవ్వాలని కోరింది. కానీ వారిలో ఎవరినీ బదిలీ చేసినట్లు ఉత్తర్వులు రాకపోవడం గర్హనీయం.

నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వండి..



సింగరేణి అధికారులతో చర్చిస్తున్న అఖిలపక్షం నాయకులు

ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియా ప్రజలకు, జేకే ఓసీ నిర్వాసితులకు న్యాయం చేసేలా సింగరేణి ఉన్నతాధికారులు లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని, లేదంటే ఓసీ కోసం ప్రారంభించిన నేల చదును పనులను అడ్డుకుంటామని 21పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ స్పష్టం చేసింది. తిలక్‌నగర్ గ్రామపంచాయతీ శివారులో జేకే-5 ఓసీ ఎక్స్‌టెన్షన్ పనుల ప్రారంభం కోసం చేపట్టిన నేల చదును పనులను అఖిల పక్ష కమిటీ నేతలు బుధవారం పరిశీలించారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో, 21పిట్ ఏరియాలో ఇళ్ల మరమ్మతు పనులకు సింగరేణి నుంచి వస్తున్న అభ్యంతరాలపై నిరసన తెలుపుతూ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన సింగరేణి అధికారులతో తమ ఆవేదనను వివరించారు. నిర్వాసితులకు 2013 భూ నిర్వాసిత చట్టం ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని, 21పిట్ క్వార్టర్లలో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, క్వార్టర్లలో సింగరేణి విద్యుత్ తొలగించి, ప్రభుత్వ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్వాసిత ప్రాంత సర్వే సమయంలో మెరుగైన ప్యాకేజీ ఇస్తామని చెప్పిన అధికారులు నేడు కేవలం ఇంటి స్థలం మాత్రమే ఇస్తామనడం తమను మోసం చేయడమేనన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై రెండు రోజుల్లో యాజమాన్యం స్పందించని పక్షంలో ఓసీ ప్రారంభోత్సవ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. పూనెం సురేందర్, అబ్దుల్ నబీ, వడ్ల శ్రీనివాస్, తాండ్ర నాగరాజు, ధనసరి రాజు, వెన్నంపల్లి శ్రీనివాస్, క్లింట్ రోచ్, ఎట్టి హరికృష్ణ, సదరం మహేష్ పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

చుంచుపల్లి: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలకు సంబంధం లేకుండా, మాజీ కౌన్సిలర్లు, అధికార పార్టీ నాయకులకు చెందిన అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని, ఎంపిక విషయంలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం మున్సిపాలిటీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీధర్ యాదవ్, గూడ విజయ, గుంపుల మహేష్, రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేష్ డిమాండ్ చేశారు. రొంపేడులో బుధవారం చేపట్టిన గ్రామాలకు తరలండి కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

ఏజెన్సీలో ప్రజల జీవన స్థితిగతులను అధ్యయనం చేసే లక్ష్యంతో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో మంద నవీన్, శ్రీనివాస్, మస్తాన్, నేతలు రాజేష్, ఆసిఫ్, గౌతమ్, తీగల శ్యామ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా పరిధిలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు బుధవారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఆధ్వర్యాన జరిగిన కౌన్సెలింగ్‌కు ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 60 మస్టర్లు, అంతకన్నా తక్కువ నమోదైన ఉద్యోగులను పిలిచారు. 140 మంది హాజరు కాగా.. ఉద్యోగులు, వారి కుటుంబీకులతో చర్చించి గైర్హాజరుకు కారణాలను ఆరా తీశారు. సింగరేణి సంస్థ ద్వారా సమాజంలో గుర్తింపు పొందిన కార్మికులు సంస్థ అభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు. ఒకవేళ ఆరోగ్యం సరిగా లేకపోతే చికిత్స చేయించుకోవాలే తప్ప గైర్హాజరు కావడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు కోటిరెడ్డి, శివకేశవరావు, బి.రవీందర్, ఎంవీఎస్ శ్యాంప్రసాద్, హరీష్ గోవర్ధన్, మజ్జి మురళీ, కె.దేవదాస్, విజయ్ సందీప్, సంఘమిత్ర, షకీల్, కావ్య, నాయకులు ఎండీ రజాక్, జె.గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో పారిశుద్ధ్యం అధ్వానం



రైటర్ బస్తీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియాలోని బర్మా క్యాంపు, బాబూ క్యాంపు, రైటర్ బస్తీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం కొరవడింది. ఫలితంగా ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనం ఇస్తున్నాయి. డ్రెయినేజీలు నిండి మురుగు కంపు కొడుతోంది. సింగరేణి సంస్థ కార్మికవాడలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు రూ.కోట్లు చెల్లించి టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తోంది. ఈ పనులు సక్రమంగా చేస్తున్నారా లేదా అని ఆయా ఏరియా సివిక్ సూపర్‌వైజర్లు పర్యవేక్షించాల్సి ఉంది. సూపర్‌వైజర్లు పనులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని ఆయా ఏరియాల ఉన్నతాధికారులు మానిటరింగ్ చేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యానికి, కాంట్రాక్టర్ అలసత్వం తోడవడంతో కాలనీలలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని కార్మికులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా... ఆయా ఏరియాల ఉన్నతాధికారులు ఏసీ రూములను వీడక, ఫోన్లలో పనులు పర్యవేక్షిస్తుండడంతో పనులు చేయకున్నా సంబంధిత సూపర్‌వైజర్లు చేసినట్లుగా సమాచారం ఇవ్వటంతో కాలనీలలో చెత్తకుప్పలు పేరుకపోతున్నాయని కార్మికులు చర్చించుకుంటున్నారు.

ఫాగింగ్ లేదు.. బ్లీచింగ్ లేదు...

కాంట్రాక్టర్లు కార్మికవాడల్లో చెత్త తీసిన తరువాత, కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను వర్కర్ల ద్వారా చల్లించాల్సి ఉంది. ఇలా చేస్తే ఆ ప్రాంతంలో దోమలు నివారించటం సాధ్యం అవుతుంది. అంతేకాకుండా కాలువల నుంచి వెదజల్లే దుర్వాసన రాకుండా ఉంటుంది. కంపెనీ కాంట్రాక్టర్లకు బ్లీచింగ్ బిల్లులను చెల్లిస్తుంది. కానీ కాలనీలలో ఎక్కడా బ్లీచింగ్ చల్లిన జాడ లేదు. అంతేకాకుండా సాయంత్రం సమయంలో దోమల సంచారం అధికంగా ఉంటున్న నేపథ్యంలో ఫాగింగ్ చేయాల్సి ఉంది. కొత్తగూడెం మున్సిపల్ సిబ్బంది కానీ, ఇటు సింగరేణి శానిటరీ సిబ్బంది కానీ ఫాగింగ్ చేయడం మర్చిపోయారని, దీంతో సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీలలో పర్యవేక్షణ సాగించి కార్మికవాడలను పరిశుభ్రంగా ఉంచాలని కార్మికులు కోరుతున్నారు.

బీటీ రోడ్డుకు మోక్షం కలిగేనా..?

- దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న ఆదివాసీ గిరిజనులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



లక్ష్మీపురం - తడికలపూడి రోడ్డు దుస్థితి

టేకులపల్లి: టేకులపల్లి మండలం తడికలపూడి పంచాయతీలో పక్కా రోడ్డు లేక దశాబ్దాలుగా ఆదివాసీ గిరిజనులు అవస్థలు పడుతున్నారు. టేకులపల్లి నుంచి తావుర్యాతండా మధ్యలో లక్ష్మీపురం క్రాస్ రోడ్ నుంచి లక్ష్మీపురం మీదుగా తడికలపూడి వరకు సుమారు రెండు కిలోమీటర్లకు పైగా ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉంది.

సుమారు 20 సంవత్సరాల క్రితమే ఈ మార్గంలో బీటీ వేశారు. అది ఇప్పుడు అడుగడుగునా ప్రమాదకరంగా గుంతలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దూరాభారం తగ్గించుకునేందుకు ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరులు టేకులపల్లి నుంచి ఖమ్మం వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్తుంటారు. ఈ రహదారి గుంతలతో అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది రాత్రిపూట ఈ మార్గంలో ప్రయాణించి ప్రమాదాలకు గురయ్యారు. లక్ష్మీపురం - తడికలపూడి మధ్యలో కల్వర్టు కూడా మరింత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డుకుంటున్న అటవీ అధికారులు...

లక్ష్మీపురం క్రాస్‌రోడ్ నుంచి లక్ష్మీపురం మీదుగా తడికలపూడికి అక్కడి నుంచి చీమలపాడు వరకు బీటీ నిర్మాణానికి రెండేళ్ల క్రితమే బీటీ రోడ్డు మంజూరయింది. సంవత్సరం క్రితం నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. తీరా పనులు మొదలు పెట్టే తరుణంలో అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నేటికీ అటవీ శాఖ అడ్డంకులు తొలగలేదు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇల్లెందు ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి అటవీ శాఖ అడ్డంకులు లేకుండా తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతలతో ఇబ్బంది పడుతున్నాం...



లక్ష్మీపురం క్రాస్ రోడ్డు నుంచి తడికలపూడి వరకు సుమారు రెండు కిలోమీటర్లు ఉంటుంది. 20 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు. ఇప్పుడు అడుగడుగునా గుంతలు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా రాత్రివేళలో ఏదైనా అర్జంటుగా వెళ్లాల్సి వస్తే ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోంది. ఎమ్మెల్యే కనకయ్య చొరవ తీసుకుని బీటీ రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ఊకె నరేందర్, తడికలపూడి